# సాక్షి పల్నాడు

గురువారం, 29, మే, 2025




## పడిపోయిన రెయిలింగ్

దుగ్గిరాల: కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు దుగ్గిరాల లాకుల వద్ద రెయిలింగ్ పక్కకు పడిపోయింది. మట్టి కోతకు గురికావడంతో రెయిలింగ్ పడిపోయింది.



## ఇండోర్ గేమ్స్ పై శిక్షణ

ప్రత్తిపాడు: స్థానిక శాఖా గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు ఇండోర్ గేమ్స్‌పై శిక్షణ ఇచ్చారు. తొలుత విద్యార్థులతో పుస్తక పఠనం చేయించి, కథలు చెప్పించారు.

## వికసించిన మే పుష్పం



తెనాలి రూరల్: చావావారిపాలెం గ్రామంలో మేరుగ అంబేడ్కర్ ఇంట్లో మే పుష్పం వికసించింది. ఈ పుష్పాన్ని గ్రామస్తులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

## న్యూస్‌రీల్

### సుబ్రహ్మణ్యేశ్వరుడికి రజత కవచం



అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతి అమరేశ్వరాలయంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి బుధవారం దాతలు రజత కవచం సమర్పించారు. మండల పరిధిలోని ధరణికోటకు చెందిన కామని వీరయ్య, సామ్రాజ్యం దంపతులు సుమారు రెండుకిలోల 395 గ్రాముల బరువుతో రూ.3లక్షల విలువైన రజత కవచానికి ఆలయంలో సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించి ఈఓ రేఖకు అప్పగించారు. అనంతరం అర్చకులద్వారా సుబ్రహ్మణ్యేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కవచాన్ని అలంకరించారు. తొలుత దాతలు అమరేశ్వరునికి అభిషేకం, బాలచాముండేశ్వరి, అమ్మవార్లకు కుంకుమపూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు

### నేడు జెడ్పీ గ్రేడ్-2 హెచ్‌ఎం పోస్టులకు కౌన్సెలింగ్


గుంటూరు ఎడ్యుకేషన్ : ఉమ్మడి గుంటూరు జిల్లాలోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయ పోస్టులను ఉద్యోగోన్నతులతో భర్తీ చేసేందుకు గురువారం కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జెడ్పీ, మండల పరిషత్ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లుగా పని చేస్తూ గ్రేడ్-2 హెచ్‌ఎం ఉద్యోగోన్నతుల కోసం సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు గురువారం ఉదయం 8 గంటలకు జెడ్పీ కార్యాలయ రోడ్డులోని భారతీయ విద్యాభవన్‌లో హాజరు కావాలని సూచించారు.

### శివాలయంలో అవినీతిపై విచారణ



మంగళగిరి : మంగళాద్రిలో వేంచేసిఉన్న శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి దేవస్థానం(శివాలయం)లో జరిగిన అవినీతిపై దేవదాయ శాఖ అధికారులు విచారణ చేపట్టారు. దేవస్థాన అభివృద్ధికి దాతలు అందించిన నగదును రికార్డులలో నమోదు చేయకపోవడంతో అభివృద్ధి పనులలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో దేవదాయ శాఖ ఉన్నతాధికారులకు భక్తులు ఫిర్యాదు చేశారు. అధికారులు బుధవారం ఆలయానికి చేరుకుని ఈవో కార్యాలయంలో పలు ఫైళ్ళను స్వాధీనం చేసుకున్నారు.

### పునఃప్రారంభమైన సదరం క్యాంప్



తెనాలిఅర్బన్: వికలాంగుల ధ్రువ పత్రాలను పునః పరిశీలన జరిపే కార్యక్రమంలో భాగంగా తెనాలిలోని జిల్లా వైద్యశాలలో బుధవారం ప్రత్యేక సదరం క్యాంప్ నిర్వహించారు. ఆర్థో, ఈఎన్‌టీ, సైక్రాటిక్ విభాగాలకు చెందిన వికలాంగులు వైద్యశాలకు వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. గురు, శుక్రవారాలలో కూడా క్యాంప్ జరుగుతుందని వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి తెలిపారు.

### 31న అయ్యప్ప స్వామి దేవస్థాన వార్షికోత్సవం



చిలకలూరిపేట: ఓగేరు వాగుకు దక్షిణాన ఉన్న అయ్యప్పస్వామి దేవస్థానం 16వ వార్షికోత్సవం ఈ నెల 31వ తేదీన వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ వెల్లంపల్లి రవిశంకర్ తెలిపారు. ఆలయ ప్రాంగణంలో బుధవారం దేవస్థాన వార్షికోత్సవ కరపత్రాలను కమిటీ సభ్యులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ వార్షికోత్సవానికి భారీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక పూజలు, అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. కమిటీ సభ్యులు తవ్వా నాగమల్లేశ్వరరావు, సత్యనారాయణ, భవిరిశెట్టి మణి పాల్గొన్నారు.

# అడ్డదిడ్డంగా దోపిడీ

- అచ్చంపేట మండలం కోనూరు ఇసుక ర్యాంపు మూసేసిన అధికారులు
- భారీ వాహనాలతో చాటుగా ఇసుక తరలించేస్తున్న పచ్చనేతలు
- ట్రాక్టర్ల ద్వారా తరలింపును అడ్డుకుంటున్న అక్రమార్కులు
- దీనికి ప్రతిగా ఇసుక లారీలను అడ్డుకున్న కోనూరు గ్రామస్తులు
- ట్రాక్టర్లను ఆపితే ఊరుకోమంటూ గ్రామస్తులు ఆందోళన
- టీడీపీ, వైఎస్సార్ సీపీ వర్గీయుల మధ్య ఘర్షణ

### అడ్డదారుల్లో ఇసుక తవ్వకాలు చేస్తున్న టీడీపీ నేతలు



కోనూరులో దారికి అడ్డంగా గ్రామస్తులు రాళ్ళు, టైర్లు పెట్టడంతో నిలిచిపోయిన ఇసుక లారీలు

అచ్చంపేట: ''ప్రభుత్వం ట్రాక్టర్లకు ఉచితంగా ఇసుక తోలుకునేందుకు అనుమతించింది.. వాటిని ఆపడానికి మీరెవ్వరు..? ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను మీరు అతిక్రమిస్తారా.. అలాగైతే మీ లారీలను కూడా మేం పోనివ్వమంటూ కోనూరు గ్రామస్తులు రహదారిపై రాళ్ల, టైర్లు అడ్డుగా బెట్టి టీడీపీ నేతలకు చెందిన లారీలను స్తంభింపజేశారు.'' కోనూరు కృష్ణానదిలో నది లోపలవరకు రోడ్డు వేసి పెద్ద పెద్ద యంత్రాలతో ఇసుక తవ్వకాలు నిర్వహిస్తున్నారని విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గతంలో ఇసుక ర్యాంప్‌ను నిలిపివేసిన విషయం తెలిసిందే. అయితే కొన్ని రోజులు మాత్రమే ఆపగలిగిన అధికారులు అడ్డదార్లను పూర్తిగా నిలిపి వేయలేకపోయారు. మళ్లీ గత వారం రోజులుగా ఇసుక రవాణా యథేచ్ఛగా కొనసాగుతుంది.

#### మా దారి అడ్డదారి..

అయితే అడ్డదారుల్లో పెద్ద పెద్ద టిప్పర్లతో అడ్డదిడ్డంగా ఇసుకను తరలిస్తున్న టీడీపీ నేతలు స్థానికులు ట్రాక్టర్ల ద్వారా చేస్తున్న తరలింపును అడ్డుకుంటున్నారు. ట్రాక్టర్ల ద్వారా ఉచితంగా ఇసుక రవాణా చేసుకోవచ్చంటూ సాక్షాత్తు సీఎం చంద్రబాబు చెబుతుండగా స్థానిక టీడీపీ నేతలు అభ్యంతరం చెబుతుండడం విడ్డూరం. గ్రామంలో సుమారు 20 నుంచి 30 ట్రాక్టర్ల ద్వారా గ్రామస్తులు ఇసుక రవాణా చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. వీరిలోనూ ఎక్కువగా టీడీపీ వారే ఉండటం గమనార్హం. వచ్చేది వర్షాకాలం కాబట్టి వర్షాలు కురిస్తే ఇసుక నిల్వ చేసుకునే అవకాశం లేనందున ఇసుకను డంపింగ్ చేసుకునేందుకు అనుమతులిచ్చారంటూ టీడీపీ నాయకులు గతంలో నదిలో అడ్డంగా వేసిన రోడ్లపైనుంచి యంత్రాల సహాయంతో నది ఒడ్డున ఇసుకను డంపింగ్ చేస్తున్నారు. ఈ ముసుగులోనే కొన్ని లారీలను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. అదేమంటే రాజధాని నిర్మాణానికి తరలిస్తున్నామని చెబుతున్నారు.

#### అడ్డుతగిలితే కేసులంటూ హుకుం

అచ్చంపేట సీఐ శ్రీనివాసరావు గ్రామస్తులను దారికి అడ్డుతగిలే కేసులు మోపుతామని, దారికి అడ్డుపడే హక్కులేదంటూ హెచ్చరించారు. నదికి అడ్డుగా రోడ్డు వేసే హక్కు ఉందా అంటూ గ్రామస్తులు ప్రశ్నించగా, ఇదంతా మాకు తెలియదని, ఎమ్మెల్యేతో మాట్లాడి అనుమతి తెచ్చుకోండి.. అప్పుడు మీ ట్రాక్టర్లకు అనుమతిస్తామని సీఐ హుకుం జారీ చేశారు. సాక్షాత్తు ముఖ్యమంత్రే ట్రాక్టర్లకు అనుమతిచ్చినప్పుడు ఇంకా ఎమ్మెల్యే అనుమతులేంటి అంటూ గ్రామస్తులు ప్రశ్నించారు. ఈ క్రమంలోనే టీడీపీ నాయకులకు, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులకు కొంత వాగ్వివాదం జరిగింది. అయితే గ్రామస్తులు ఎంత ఆందోళనలకు దిగినా చివరకు ఏమీ సాధించలేకపోయారు. ట్రాక్టర్ల ద్వారా ఇసుకను రవాణా చేసుకునే హక్కును పొందలేకపోయారు. భారీ ఇసుక లోడ్ లారీలు మాత్రం నదిలో వేసిన అడ్డదారిలో యథేచ్ఛగా తరలి వెళుతూనే ఉన్నాయి.

#### తిరగబడ్డ గ్రామస్తులు

గ్రామంలో ఇప్పటికి వరకు ట్రాక్టర్ల ద్వారా ఇసుక రవాణా జరగ్గా, ఎప్పుడైతే లారీలతో రవాణా మొదలుపెట్టారో అప్పటి నుంచి నదిలోకి ట్రాక్టర్లను అనుమతించడం నిలిపివేశారు. దీంతో గ్రామస్తులు తిరగబడ్డారు. లోడ్ చేసిన లారీలను పోనివ్వకుండా గ్రామనడిబొడ్డులో పెద్ద పెద్ద రాళ్ల, టైర్లు పెట్టి నిలిపి వేశారు. ట్రాక్టర్లను అనుమతించే వరకు లారీలను కూడా వెళ్లనివ్వమంటూ భీష్మించుకుని కూర్చుని ఆందోళన చేపట్టారు. ఇంతలో పోలీసులు రంగప్రవేశం చేసి ఆందోళనకారులను స్టేషన్‌కు పిలిపించారు. కొంతమంది గ్రామస్తులు అచ్చంపేట పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు.

# రైతులు రోడ్డెక్కితే రాష్ట్రం స్తంభిస్తుంది

- నల్లమడ రైతు సంఘం కన్వీనర్ డాక్టర్ కొల్లా రాజమోహనరావు
- బర్లీ పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించాలని నిరసన దీక్ష

చిలకలూరిపేట: బర్లీ పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు రోడ్లమీదకు వస్తే రాష్ట్రం స్తంభించి పోతుందని నల్లమడ రైతు సంఘం కన్వీనర్ డాక్టర్ కొల్లా రాజమోహనరావు చెప్పారు. బర్లీ పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో ఐటీసీ కంపెనీ ముందు నిర్వహిస్తున్న నిరసన దీక్ష బుధవారం రెండోరోజు కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాది రైతాంగ ఉద్యమాలను ఆదర్శంగా తీసుకొని రైతులు పోరాటానికి సిద్ధం కావాలన్నారు. బర్లీ పొగాకు కలపకుండా ప్రపంచంలో ఏ దేశంలోనూ సిగరెట్లు తయారు కావన్నారు. సువాసన కోసం బర్లీ పొగాకును విదేశాలు సిగరెట్లలో ఉపయోగిస్తాయని తెలిపారు. పొగాకు కంపెనీలు కుట్రపూరితంగా ఏకమై ధరలను పతనం చేసేందుకు బర్లీ పొగాకు కొనుగోళ్లను నిలిపివేశారని ఆరోపించారు.

#### మంత్రి సమక్షంలో జరిపిన చర్చలకు విలువ లేదా?

రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకువెళితే చర్చలతో సరిపెడుతున్నారని, రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రి అచ్చెన్నాయుడు సమక్షంలో జరిగిన చర్చలకు విలువలేకుండా పోయిందని వెల్లడించారు. పొగాకు కంపెనీలు రైతుల జీవితాలతో చెలగాటమాడుతుంటే, ప్రభుత్వం చర్యలు చేపట్టకుండా అచేతనంగా ఉండటం ఏ మాత్రం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల బాధలు వింటే భవిష్యత్తు ఏమవుతుందోనని ఆందోళన కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది బర్లీ పొగాకు మంచి ధరలు లభించటంతో రైతులు బర్లీ పొగాకును ఎక్కువగా సాగు చేశారని వెల్లడించారు. ఈ విషయాన్ని గుర్తించిన పొగాకు కంపెనీలు రైతుల వద్ద ఉన్న పొగాకును కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పొగాకును కొనుగోలు చేయకుండా వ్యవహారాన్ని సాగదీసి తక్కువ ధరకు రైతుల వద్ద కొని విదేశాలకు ఎగుమతి చేయడం ద్వారా కోట్లు గడించేందుకు కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. గత ఏడాది బర్లీ పొగాకు క్వింటా రూ. 18వేల వరకు కొన్నారని, ఈ ఏడాది కనీసం క్వింటాకు రూ. 15 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంతో చర్చలు జరిపినప్పుడెల్లా కొనుగోళ్లు చేస్తాం అనడం తప్పించి, అడుగు ముందుకు పడటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోరాటాలతోనే సమస్యలు పరిష్కరించేందుకు రైతులు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు తాళ్లూరి బాబురావు, దాసరి వరహాలు, పేలూరి రామారావు, షేక్ సుభాని, ఇంటూరి భవాని వెంకటేష్, దోమల మరియదాసు, రెడ్డమ్మ నరిసిరెడ్డి, షేక్ నసీరుద్దీన్, మాడ శివ ప్రసన్నబాబు, జొన్నల రాజశేఖరరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం రాధాకృష్ణ, లోక్ సత్తా మాదాసు భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొల్లా రాజమోహనరావు, చిత్రంలో రైతు సంఘాల సమన్వయ సమితి నాయకులు

# యోగాతో ఆరోగ్యం.. ఉల్లాసం



కోటప్పకొండలో యోగ శిక్షణలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

- జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే
- కోటప్పకొండలో యోగాంధ్ర



మాట్లాడుతున్న జేసీ సూరజ్ గనోరే

నరసరావుపేట రూరల్: యోగా ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో భాగం కావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమలో భాగంగా ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండలో బుధవారం యోగా శిక్షణా శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్, జిల్లా రెవెన్యూ అధికారి మురళీతో పాటు పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు యోగా శిక్షణ నిర్వహించారు. ఈసందర్భంగా జాయింట్ కలెక్టర్ సూరజ్ మాట్లాడుతూ యోగా వలన ఆరోగ్యం, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. దీంతో పాటు కొన్ని శారీరక రుగ్మతలు దూరం అవుతాయని తెలిపారు. ప్రతి ఒక్కరు యోగా సాధనను అలవర్చుకొని ఆయుష్షును పెంచుకోవాలని సూచించారు. పవిత్రమైన కోటప్పకొండపై యోగా శిక్షణను ఏర్పాటుచేసిన అధికారులను అభినందించారు.


# వైభవంగా పోలేరమ్మ తల్లి దేవాలయ ప్రతిష్ట



అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బొల్లా

ఈపూరు(శావల్యాపురం)/వినుకొండ : ఈపూరు మండలం ఊడిజర్ల గ్రామంలో గ్రామస్తులు రూ.25లక్షల వ్యయంతో నిర్మించిన పోతురాజు - పోలేరమ్మ తల్లి దేవాలయం విగ్రహాల ప్రతిష్టా కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి విచ్చేసిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. తెల్లవారుజాము నుంచి వేదపండితులు వేదమంత్రాలతో గణపతి పూజ, పుణ్యాహావాచనం, మండపారాధన, ప్రధాన హోమాలు, యంత్ర ప్రతిష్ట, మహాపూర్ణాహుతి, విగ్రహ ప్రతిష్ఠ, మహా కుంభాభిషేకం, విశేష పూజలు ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నరసరావుపేట, గుంటూరు పార్లమెంట్ పరిశీలకులు, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు గోనుగుంట్ల లీలావతి, తదితరులు అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. భక్తులకు భారీ అన్నదానం నిర్వహించారు.

## సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 512.60 అడుగుల వద్ద ఉంది. ఇది 136.1274 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకు 5,598 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది.

# జీజీహెచ్‌లో కరోనా వైద్య సేవలు





గుంటూరు జీజీహెచ్

గుంటూరు మెడికల్: కొన్నేళ్ల క్రితం ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా వైరస్ మరోసారి వెలుగులోకి వచ్చింది. పలువురు బాధితులు కరోనాతో బాధపడుతుండటంతో గుంటూరు జీజీహెచ్‌లో కరోనా బాధితుల కోసం ప్రత్యేకంగా 15 పడకలతో వార్డు ఏర్పాటు చేశారు. ఇన్‌పేషెంట్ విభాగంలో బీ క్లాస్ రూములో కూడా బాధితుల కోసం సిద్ధం చేసి ఉంచారు. అత్యవసర విభాగం వద్ద నూతనంగా నిర్మించిన స్టెప్ డౌన్ ఐసీయూ గదిని కరోనా బాధితుల కోసం ఏర్పాటు చేసినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ తెలిపారు. ఇప్పటికే కరోనా అనుమానంతో వచ్చిన ఐదుగురికి వైద్య పరీక్షలు చేశామని, రిపోర్టు నెగిటివ్ వచ్చిందని వెల్లడించారు. జీజీహెచ్‌లో కరోనా బాధితులకు ప్రత్యేకంగా ఓపీని ప్రారంభించామన్నారు. ఆక్సిజన్ కాన్సెంట్రేటర్స్, సీప్యాప్ మిషన్లు, వెంటిలేటర్లు అందుబాటులో ఉంచామన్నారు. జనరల్ మెడిసిన్ వైద్యులు ప్రత్యేకంగా బృందాలుగా ఏర్పడి కరోనా వైద్య సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు.

#### వైద్య సేవలకు సిద్ధంగా ఉండండి

రాష్ట్రవ్యాప్తంగా టీచింగ్ ఆసుపత్రుల్లో కరోనా వైద్య సేవలు అందించేందుకు ఆయా టీచింగ్ ఆసుపత్రుల సూపరింటెండెంట్‌లు సిద్ధంగా ఉండాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డీఎంఈ ఆదేశించారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా టీచింగ్ ఆసుపత్రుల సూపరింటెండెంట్‌లతో జూమ్ కాన్ఫరెన్సు నిర్వహించారు. సమావేశంలో డీఈఓ డాక్టర్ నరసింహం మాట్లాడుతూ గుంటూరు జీజీహెచ్‌లో ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో ఎక్కువ మంది చికిత్స పొందేలా చూడాలన్నారు. ఈ - హాస్పిటల్ వైద్య సేవలు పెంచాలన్నారు. సమావేశానికి హాజరు కాని జీజీహెచ్ వైద్యులకు మెమో జారీ చేయాలని ఆదేశించారు. సమీక్షలో గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణతో పాటు పలు వైద్య విభాగాధిపతులు, ఆయా టీచింగ్ ఆసుపత్రుల సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.

# పచ్చిరొట్ట పైరుతో ప్రయోజనాలు

వ్యవసాయ శాఖ రాష్ట్ర సంచాలకులు



పీఎండీఎస్ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న ఢిల్లీరావు

తెనాలి టౌన్: ఖరీఫ్ సాగుకు ముందు పచ్చిరొట్ట పైరు సాగు చేసుకోవాలని వ్యవసాయశాఖ రాష్ట్ర సంచాలకులు ఎస్.ఢిల్లీరావు రైతులకు సూచించారు. రూరల్ మండలం ఎరుకలపూడి గ్రామంలో రైతు ముళ్ళపూడి రంగయ్య ప్రయోగాత్మకంగా చేపట్టిన పీఎండీఎస్ క్షేత్రాన్ని బుధవారం ఎస్.ఢిల్లీరావు పలువురు అధికారులతో కలిసి పరిశీలించారు. ఆంధ్రప్రదేశ్ ప్రకృతి వ్యవసాయ సంస్థ 7, 8 సంవత్సరాలుగా పరిశోధించి 32 రకాల పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు అందిస్తున్నట్లు చెప్పారు. వీటిని వేసుకోవడం వలన సేంద్రియ కర్బనం పెరుగుతుందని తెలిపారు. ఎరువుల మోతాదు తగ్గించుకోవచ్చని వివరించారు. జనుము, జీలుగ, పిల్లి పెసర విత్తనాలను వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు సబ్సిడీపై పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. ఈ విధానం వలన కాంప్లెక్స్ ఎరువులు, పురుగు మందుల ఖర్చు భారీగా తగ్గించుకోవచ్చని అన్నారు. భూమి గుల్లబారి ఆరోగ్యంగా ఉంటుందని, సూక్ష్మపోషకాలు త్వరగా లభ్యమవుతాయని అన్నారు. ప్రతి రైతును చైతన్యపరచి పచ్చిరొట్ట విత్తనాలు వేసుకోనేలా అధికారులు పనిచేయాలని ఆదేశించారు. గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లా వ్యవసాయాధికారి ఎన్.వెంకటేశ్వర్లు, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.రాజకుమారి, ఏడీఏ ఎన్.ఉషారాణి, రైతులు పాల్గొన్నారు.

# లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసుల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికళ్యాణ్ చక్రవర్తి

గుంటూరు లీగల్: లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికళ్యాణ్‌చక్రవర్తి పేర్కొన్నారు. బుధవారం కోర్టు ప్రాంగణంలో ఈ నెల 28 నుంచి జూన్ 7వ తేదీ వరకు జరుగనున్న లోక్ అదాలత్‌పై కంపెనీ సభ్యులు, కౌన్సిలర్లు, ఇన్సూరెన్స్ కంపెనీల న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ కేసుల సత్వర పరిష్కారానికి తీసుకోవలసిన చర్యల గురించి వివరించారు. అందరూ సహకరించాలని సూచించారు. సమావేశంలో ఒకటో అదనపు జిల్లా జడ్జి వి.ఎ.ఎల్.సత్యవతి, గుంటూరు ఫ్యామిలీ కోర్టు జడ్జి జి. చక్రపాణి, నాలుగో అదనపు జిల్లా జడ్జి ఆర్. శరత్ బాబు, ఐదో అదనపు జిల్లా జడ్జి కె. నీలిమ, మూడో అదనపు జిల్లా జడ్జి సి.హెచ్.వి.ఎస్. శ్రీనివాసరావు, పోక్సో కోర్ట్ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి షమీ పర్వీన్ సుల్తానా బేగం, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ సయ్యద్ జియావుద్దీన్, బార్ అధ్యక్షుడు వై.సూర్య నారాయణ పాల్గొన్నారు.

# సత్తెనపల్లిలో ఒకరికి కరోనా లక్షణాలు!

సత్తెనపల్లి: సత్తెనపల్లి పట్టణంలోని పాత సాలిపేటలో ఒకరికి కరోనా లక్షణాలు ఉన్నాట్లు బుధవారం గుర్తించారు. జ్వరం, జలుబుతో బాధపడుతూ ఒకరు గుంటూరులో ర్యాపిడ్ పరీక్షలు చేయించుకోగా కరోనా లక్షణాలు ఉన్నట్లు వెల్లడి కావడంతో మరో పరీక్ష ఉన్నందున అధికారికంగా ధ్రువీకరించవద్దని వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు ప్రకంటించినట్లు సమాచారం. కరోనా లక్షణాల నేపథ్యంలో గురువారం పాత సాలిపేటలో జ్వరాల సర్వే శిబిరం నిర్వహించనున్నారు.




## క్లుప్తంగా

### ఎన్టీఆర్‌కు ఘననివాళి



నరసరావుపేట: తెలుగువారి ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి నందమూరి తారక రామారావు అని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలు చల్లి ఘన నివాళులర్పించారు. అదనపు ఎస్పీ(అడ్మిన్) జేవీ సంతోష్, ఏఆర్ వెల్ఫేర్ ఆర్ఐ గోపినాథ్, ఎస్బీ సీఐ శరత్ బాబు, సీసీ ఆదిశేషు, ఆర్ఐలు శ్రీహరిరెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

**నివాళులర్పించిన జేసీ..**



నరసరావుపేట: మహనీయుల జయంతి వేడుకలు నిర్వహించుకోవడం వారికి ఇచ్చే గొప్ప గౌరవమని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో మాజీ సీఎం నందమూరి తారకరామారావు జయంతి వేడుకలు నిర్వహించారు. జేసీ సూరజ్ గనోరే ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. డీఆర్‌ఓ ఏకా మురళి, డిప్యూటీ కలెక్టర్ కుమార్, ఆర్డీఓ కె.మధులత, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### సభ్యుల పేరుతో రూ.4 లక్షల రుణం పొందిన ఆర్‌పీ

**లబోదిబోమంటున్న సభ్యులు**

అద్దంకి రూరల్: గ్రూపు సభ్యులకు తెలియకుండా వారి పేరుతో ఆర్‌పీ.. ఓ బ్యాంకులో రూ. 4 లక్షల రుణం పొందిన సంఘటన ఫిబ్రవరి 2వ తేదీ జరగ్గా అసల్యంగా వెలుగులోకి వచ్చింది. మెప్మా అధికారి శ్రీలత తెలిపిన వివరాల మేరకు.. అద్దంకి మెప్మా కార్యాలయంలో వెంకటేశ్వర మహిళా సమాఖ్య గ్రూపులో ఆర్‌పీగా పనిచేస్తున్న మల్లాది గాయత్రి ఆదర్శ పొదుపు గ్రూపు సభ్యులకు తెలియకుండా సీసీఎల్ రుణం రూ. 4 లక్షల బ్యాంకు నుంచి తీసుకుంది. ఈ విషయం తెలుసుకున్న గ్రూపు సభ్యులు మెప్మా అధికారికి తెలిపారు. ఆమె అప్పటి నుంచి ఆఫీస్‌కు రాకపోవటంతో ఎందుకు రావటం లేదని మెప్మా అధికారి విచారించగా 4 నెలల నుంచి ఆచూకీ లేదని తెలిసింది. బ్యాంకు వద్దకు వెళ్లి గ్రూపులో వివరాలను సేకరించగా గత నాలుగు నెలల నుంచి రుణం కట్టటం లేదని సీసీఎల్ లోను రూ. 4 లక్షలు, గ్రూపులోను రూ. 3 లక్షలు మొత్తం రూ. 7 లక్షలు రుణం ఉన్నట్లు బ్యాంకు అధికారులు గుర్తించారు. ఆర్‌పీ గాయత్రిని ఆమె కూమారుడు ద్వారా ఆఫీస్‌కు పిలిపించి బుధవారం విచారించగా తాను తీసుకున్న రుణం రూ.4 లక్షల వడ్డీతో సహా చెల్లిస్తానని లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చినట్లు మెప్మా అధికారి తెలిపారు.

# నాటకరంగ అభివృద్ధికి పరిషత్‌ల కృషి ఎనలేనిది

- సినీ, సీరియల్ నటుడు ముత్తవరపు సురేష్‌బాబు
- నేటితో ముగియనున్న జాతీయస్థాయి నాటికల పోటీలు



ముత్తవరపు సురేష్‌బాబు దంపతులను సన్మానిస్తున్న కళాపరిషత్ సభ్యులు

నాదెండ్ల: తెలుగు నాటక రంగాభివృద్ధికి కళాపరిషత్‌లు చేస్తున్న కృషి అభినందనీయమని సినీ, సీరియల్ నటుడు, పుచ్చలపల్లి సుందరయ్య కళాపరిషత్ అధ్యక్షుడు ముత్తవరపు సురేష్‌బాబు చెప్పారు. పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం సాతులూరు గ్రామంలో ఎన్టీఆర్ కళాపరిషత్ తృతీయ జాతీయస్థాయి నాటిక పోటీలు గురువారం ఐదో రోజు కొనసాగాయి. సభాధ్యక్షుడిగా బండారుపల్లి సత్యనారాయణ వ్యవహరించగా, ముఖ్యఅతిథులుగా రచయిత పిన్నమనేని మృత్యుంజయరావు, వరగాని కళాపరిషత్ అధ్యక్షుడు పోపూరి నాగేశ్వరరావు, లింగారావుపాలెం కొండవీడు కళాపరిషత్ అధ్యక్షుడు కట్టా శ్రీహరిరావు, కర్రపాడు ఉషోదయ కళానికేతన్ అధ్యక్షుడు చెరుకూరి సాంబశివరావు పాల్గొన్నారు. ముత్తవరపు మాట్లాడుతూ తెలుగు నాటక రంగాన్ని నిలబెట్టేందుకు జూన్ మాసంలో జాతీయస్థాయిలో సదస్సుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అనంతరం కన్నాంబ అవార్డు గ్రహీత ఎస్.అమృతవర్షిణి, ముత్తవరపు సురేష్, అరుణకుమారి దంపతులను కళాపరిషత్ సభ్యులు, అతిథులు శాలువాలు, పూలమాలలతో సత్కరించి జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో పాండురంగారావు, నాగమల్లి, రామారావు, పెద్దబ్బాయి, పరిషత్ నిర్వాహకుడు నడింపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

**ఆకట్టుకున్న ప్రదర్శనలు...**

తాడేపల్లి అరవింద ఆర్ట్స్‌వారి 'విడాకులు కావాలి', తెనాలి అద్దేపల్లి ఆరాధ్యుల ఆర్ట్స్‌వారి 'ఎవరు' కర్రపాడు ఉషోదయ కళానికేతన్‌వారి 'కిడ్నాప్' నాటకాలు పేక్షకులను అలరించాయి.

## అంగన్‌వాడీ అధికారుల అనధికార వసూళ్ల ఆడియో కలకలం

వినుకొండ: వినుకొండ నియోజకవర్గంలో అంగన్‌వాడీ అధికారుల అక్రమ వసూళ్ల వ్యవహారం చర్చనీయాంశమైంది. సామాజిక మాధ్యమాల్లో సీడీపీఓ బదిలీపై ప్రతి ఒక్క సెంటర్ నుంచి డబ్బులు పంపాలని, ప్రతినెలా ఇచ్చేవిధంగా కచ్చితంగా ఇవ్వాలని ఒక అంగన్‌వాడీ కార్యకర్త మాట్లాడిన ఆడియో రికార్డు సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తుండడంతో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, సీడీపీఓలపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆడియోను బట్టి ప్రతినెలా అంగన్‌వాడీ సెంటర్‌ల నుంచి లంచాలు వసూలు చేస్తున్నట్లు సమాచారం. దీనిపై ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

## పోలీసుల బదిలీలు

నగరంపాలెం: జిల్లాలో పలువురు ఏఎస్సైలు, హెడ్‌కానిస్టేబుల్స్, కానిస్టేబుళ్లను బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ముగ్గురు ఏఎస్సైలు, పది మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 12 మంది కానిస్టేబుళ్లను బదిలీ చేశారు.

# బీచ్ కబడ్డీ పురుషుల రాష్ట్ర జట్టుకు శిక్షణ



మాట్లాడుతున్న సుబ్బరాజు

చెరుకుపల్లి: జూన్ 5 నుంచి 8వ తేదీ వరకు మచిలీపట్నంలోని మంగినపూడి బీచ్‌లో నిర్వహించనున్న 12వ జాతీయ బీచ్ కబడ్డీ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర పురుషుల జట్టుకు శిక్షణ ఇస్తున్నట్టు ఏపీ కబడ్డీ అసోసియేషన్ కోశాధికారి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి ఎం.సుబ్బరాజు తెలిపారు. జట్టుకు మండలంలోని పొన్నపల్లి గ్రామంలో శిక్షణ శిబిరాన్ని బుధవారం సుబ్బరాజు ప్రారంభించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూన్ 3వ తేదీ వరకు శిక్షణ కొనసాగనున్నట్లు తెలిపారు. ఇదే గ్రామానికి చెందిన కుంచల శ్రీనివాసరెడ్డి స్పాన్సర్‌గా వ్యవహరించనున్నట్టు చెప్పారు. ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ వై.శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించన్ను పోటీలకు పురుషుల జట్టుకు పర్యవేక్షకులుగా విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు వైఎస్సార్ ప్రసాద్, రాధాకృష్ణమూర్తి వ్యవహరిస్తారని తెలిపారు. శిబిరానికి నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా, ఈస్ట్ గోదావరి జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరు అయ్యారని పేర్కొన్నారు. శిక్షణ అనంతరం తుది జట్టు ను ఎంపిక చేయనున్న వివరించారు.

## 71 మంది రక్తదానం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వలంటరీ బ్లడ్ డోనార్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయంలో రక్తదాన శిబిరం జరిగింది. శిబిరాన్ని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని ప్రారంభించారు. శిబిరంలో అసోసియేషన్ ప్రతినిధులు 71 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్తదాతలను నీలం సాహ్ని ప్రత్యేకంగా అభినందించారు. అసోసియేషన్ అధ్యక్షుడు, ఎన్నికల కమిషన్ జాయింట్ సెక్రటరీ జీవీ సాయిప్రసాద్ మాట్లాడుతూ రక్తదానం ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మదన్‌మోహన్ పాల్గొన్నారు.

## జిల్లా వినియోగదారుల ఫోరం చైర్మన్‌గా విజయలక్ష్మి



గుంటూరు లీగల్: గుంటూరు జిల్లా వినియోగదారుల ఫోరం చైర్మన్‌గా కుమ్మమూరు విజయలక్ష్మి నియమితులయ్యారు. విజయలక్ష్మి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో బీకాం చేశారు. గుల్బర్గా యూనివర్సిటీలో 1991లో న్యాయ శాస్త్రంలో పట్టా పుచ్చుకున్నారు. 1992లో న్యాయవాదిగా బార్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌లో ఎన్‌రోల్ అయ్యారు. సోదరుడు కృష్ణకిషోర్ వద్ద న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. బుధవారం గుంటూరు జిల్లా కన్స్యూమర్ ఫోరం చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

## ఒకటిన జిల్లా క్రికెట్ జట్లు ఎంపిక

గుంటూరు వెస్ట్ ( క్రీడలు ): జిల్లా క్రికెట్ సంఘం త్రీమెన్ కమిటీ ఆధ్వర్యంలో జూన్ 1వ తేదీన స్థానిక అరండల్‌పేటలోని పిచ్చుకుల గుంటలో జిల్లా జట్ల ఎంపిక నిర్వహిస్తామని సభ్యులు యు.మహతి శంకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-19 యువకులు జట్టుకు ఉదయం 8 గంటలకు, అండర్-19 యువతులకు మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తారు. నవంబర్ 1,2006 తర్వాత జన్మించినవారై ఉండాలి. అండర్-15 బాలికలకు మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తారు. నవంబర్ 1, 2010 తర్వాత జన్మించిన వారై ఉండాలి. అండర్-23 ఉమెన్స్‌కు మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తారు. వీరు నవంబర్ 1,2001 తర్వాత జన్మించినవారై ఉండాలి. పోటీలకు హాజరయ్యే క్రికెటర్లు వైట్ డ్రెస్‌తోపాటు సొంత కిట్ కలిగి ఉండాలి. వయస్సు ధ్రువీకరణ పత్రంతోపాటు ఆధార్‌ను తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాలకు మహతి శంకర్‌ను 98491 50249 నంబరులో సంప్రదించాలన్నారు.



స్థానిక షరాఫ్‌బజారులోని శ్రీసువర్చలా సమేత శ్రీపంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో జరుగుతున్న వార్షిక శ్రీహనుమత్ జయంతి మహోత్సవాలు, 17వ లక్ష శ్రీహనుమాన్ చాలీసా పారాయణలో భాగంగా బుధవారం సాయంత్రం తమలపాకులతో విశేష పూజలకు వెళుతున్న భక్తులు - తెనాలి

## నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష

గుంటూరు లీగల్: అత్యాచార యత్నం కేసులో నిందితుడికి జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. 86 సంవత్సరాల వృద్ధురాలిపై లైంగిక దాడికి యత్నించిన పాలపర్తి మంజు అనే 21 సంవత్సరాల యువకుడిపై పెదనందిపాడు పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో ఈ మేరకు తీర్పు వచ్చింది. నిందితుడికి ఐదు సంవత్సరాలు జైలు శిక్ష, రూ. 5 వేలు జరిమానా విధిస్తూ గుంటూరు ఐదో జిల్లా కోర్టు న్యాయమూర్తి బుధవారం తీర్పు వెలువరించారు. బాధితురాలి తరపున ప్రాసిక్యూషన్ న్యాయవాదిగా పల్లపు కృష్ణ వాదనలు వినిపించారు.

## కేశవకుమార్ సాహిత్యంలో ధిక్కార స్వరం

**కవితా సంపుటాల ఆవిష్కరణలో వక్తలు**



ఆవిష్కరణలో తిరుపతిరావు, సీతారాం, కేశవకుమార్, స్వరూపరాణి

తెనాలి: గత మూడున్నర దశాబ్దాల తెలుగు కవిత్వంలో కేశవకుమార్‌ది ముఖ్యమైన గొంతుక అని, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విప్లవాత్మక భావజాలం ద్వారా ప్రేరణ పొందిన కవి అని ప్రముఖ సాహితీ విమర్శకుడు, ప్రొఫెసర్ బి.తిరుపతిరావు ప్రశంసించారు. ఆయన కవిత్వం సామాజిక-రాజకీయ విమర్శ, తాత్విక అన్వేషణల శక్తిమంతమైన సమ్మేళనాన్ని సూచిస్తుందని అన్నారు. ఢిల్లీ విశ్వవిద్యాలయం తత్వశాస్త్ర ప్రొఫెసర్, తెనాలి సమీపంలోని మండల కేంద్రం అమృతలూరుకు చెందిన కేశవకుమార్ రచించిన కవితలతో తీసుకొచ్చిన రెండు కవితా సంపుటాలను బుధవారం సాయంత్రం హోటల్ గౌతమ్ గ్రాండ్ హోటల్‌లో ఆవిష్కరించారు. 'భిన్నస్వరాలు' ఆధ్వర్యంలో ఏర్పాటైన సభకు జీఎస్ నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. కేశవకుమార్ కవితా సంపుటి 'ఆదిమ పౌరుడు'ను బి.తిరుపతిరావు, 'ఎగిరే పళ్లెం నడిచే మంచం ఓ కూనిరాగం' సంపుటిని ప్రముఖ కవి సీతారాం ఆవిష్కరించారు. తిరుపతిరావు మాట్లాడుతూ అమృతలూరులో పుట్టి, దళిత ఉద్యమాలు, దళితుల ఆర్థిక, సామాజిక, రాజకీయ ఎదుగుదలను చూస్తూ పెరిగిన క్రమంలో కేశవకుమార్ వాటిని సొంతం చేసుకున్నారని చెప్పారు. ఆయన భావాలన్నీ అంబేడ్కర్ ఆలోచనల చుట్టూ తిరుగుతుంటాయన్నారు. రాడికల్‌గా సమీక్షించటం, విమర్శించటం ఆయన రచనల్లో గోచరిస్తుందని చెప్పారు. విస్తృతంగా రాస్తున్న కవితలు, వ్యాసాల్లో వ్యంగ్యాన్ని జోడించి విమర్శనాత్మకంగా రాయటం కేశవకుమార్ శైలి అన్నారు. సమకాలీన విషయాలపై తక్షణం స్పందించి రాయటం ఆయన ప్రత్యేకతగా చెప్పారు. కవి సీతారాం మాట్లాడుతూ, సెంట్రల్ యూనివర్సిటీలో జరిగిన విద్యార్థుల ప్రతిఘటన, నిరసన ఉద్యమాల్లో కేశవకుమార్ ముందుండి గొంతెత్తారని చెప్పారు. అంబేడ్కర్, పూలే భావధారలో తనను తాను రూపుదిద్దుకున్న కేశవకుమార్ రచనలు, తెలుగునాట దళితవాద సాహిత్యానికి ప్రోత్సాహాన్ని, ప్రేరణను ఇస్తాయని చెప్పారు. ప్రముఖ దళిత స్త్రీవాద రచయిత్రి చల్లపల్లి స్వరూపరాణి తన ప్రసంగంలో విప్లవ సాహిత్యానికి కేంద్రబిందువుగా ఉన్న సెంట్రల్ యూనివర్సిటీ నుంచి వచ్చిన కేశవకుమార్ కవితా సంపుటాల్లో దళిత, బహుజన సాహిత్యంలో వచ్చిన ధోరణులు ప్రతిబింబిస్తాయని చెప్పారు. కత్తి కళ్యాణ్ మాట్లాడుతూ కేశవకుమార్ కవిత్వంలో నిరసన, ధిక్కారం, వ్యంగ్యం ప్రదర్శిస్తూ సమాజానికి అనేక ప్రశ్నలు సంధించారని చెప్పారు. సభలో శిఖా-ఆకాష్, నూకతోటి రవికుమార్, ఎన్‌జే విద్యాసాగర్, శ్రీశ్రీ ప్రింటర్స్ విశ్వేశ్వరరావు, తంగిరాల సోని మాట్లాడారు. కేశవకుమార్ కృతజ్ఞతలు తెలియజేశారు. భిన్నస్వరాలు బాధ్యులు జుగాష్‌విలి, ఉమ తదితరులు పాల్గొన్నారు.

## 11 నెలలుగా అందని జీతాలు

**ఏపీజీఏఈ జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా**



గుంటూరు వెస్ట్: స్థానిక బీఆర్ స్టేడియంలో ఔట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు 11 నెలలుగా జీతాలు అందడం లేదని ఏపీజీఏఈ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్ బాషా తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ ఎ.భార్గవ్ తేజను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చాంద్ బాషా మాట్లాడుతూ అంతంత మాత్రపు జీతాలతో నెట్టుకొచ్చే చిరుద్యోగులకు నెలవారీ జీతాలు అందకపోతే చాలా ఇబ్బందులు పడతారన్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో అప్పులు చేస్తున్నారని తెలిపారు. తక్షణం ఉద్యోగులకు జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అసోసియేషన్ నాయకులు లక్ష్మీనారాయణ, వై.నాగేశ్వరరావు, కోటా సాహెబ్, పెదరత్తయ్య, జాన్ పాల్గొన్నారు.

# 'కొండవీడు' ఘర్షణపై కేసు నమోదు

- ఇరువర్గాల నుంచి ఫిర్యాదులు
- రెండు కేసులు నమోదు చేసిన పోలీసులు

యడ్లపాడు: చారిత్రక ప్రదేశం కొండవీడుకోట హిల్‌టాప్ వద్ద ఈ నెల 26న సాయంత్రం జరిగిన ఘర్షణ తాలూకు యడ్లపాడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. సందర్శనకు వచ్చిన మహిళ కుటుంబం, అక్కడ విధుల్లో ఉన్న స్ట్రయికర్స్(ఔట్‌సోర్సింగ్ సిబ్బంది) మధ్య నెలకొన్న ఘర్షణకు సంబంధించి ఇరువర్గాల నుంచి ఫిర్యాదులు అందుకున్న పోలీసులు పాతిక మందిపై రెండు కేసులు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...

- గుంటూరు నగరానికి చెందిన దాసరి లక్ష్మీప్రియ తన కుటుంబంతో కలిసి సోమవారం సాయంత్రం కొండవీడుకోటను సందర్శించారు. కొండపై పార్కు వద్ద ఫొటోలు దిగేందుకు ప్రయత్నించడంతో వారిని వెళ్లిపోవాలని సిబ్బంది వారించారు. ఇరువర్గాల మధ్య వాగ్వాదం పెరిగి చివరకు గ్రామస్తులతో ఘర్షణకు దారితీసింది. కొండవీడు సందర్శనకు వచ్చిన తమపై సుమారు 20 మంది స్థానికులు తమ కారును అడ్డగించి ధ్వంసం చేయడంతో పాటు తన కుటుంబ సభ్యులపై తీవ్రంగా దాడి చేశారంటూ బాధితురాలు దాసరి లక్ష్మీప్రియ ఫిర్యాదు చేసింది.

- అలాగే సమయం ముగిశాక వచ్చిన సందర్శకులు తమను నానా దుర్భాషలాడటంతో పాటు విధుల్లో ఉన్న తమపై బటన్ స్టిక్, పెప్పర్లతో దాడి చేయగా స్ట్రయికర్లలో మణికంఠ, అచ్చారావు, ఫయాజ్‌లను గాయపరిచినట్లు లక్ష్మీప్రియ కుటుంబ సభ్యులు నలుగురిపై ఆముదాల గోపీ ఫిర్యాదు చేశాడు. ఈ రెండు ఫిర్యాదుల్ని అందుకున్న యడ్లపాడు ఎస్ఐ టి.శివరామకృష్ణ రెండు కేసుల్ని మంగళవారం రాత్రి నమోదు చేశారు. గాయాలైన లక్ష్మీప్రియ కుటుంబ సభ్యులను ఆస్పత్రికి తరలించి చిలకలూరిపేట రూరల్ సీఐ బి.సుబ్బానాయుడు పర్యవేక్షణలో దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# కారును ఢీకొన్న స్కూటీ

- అక్కాచెల్లెళ్లతో పాటు మరో మహిళకు గాయాలు
- యడ్లపాడు మండలం బోయపాలెం వద్ద ఘటన

యడ్లపాడు: కారును స్కూటీ ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు మహిళలు గాయపడి ఆస్పత్రి పాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నెల్లూరుకు చెందిన ఇమడశెట్టి వెంకటసత్య ధనుష్, అత్తులూరి భార్గవి కారులో గుంటూరు నుంచి చిలకలూరిపేట వైపు ప్రయాణమయ్యారు. యడ్లపాడు మండలం బోయపాలెం పరిధిలోని 16వ నంబర్ జాతీయ రహదారి సర్వీస్‌రోడ్డు కటింగ్ సమీపంలో ఒక్కసారిగా కారును ఎడమవైపునకు మళ్లించారు. సరిగ్గా ఆ కారు వెనుకగా వేగంగా వస్తున్న స్కూటీ కారును వెనుక భాగంలో ఢీకొట్టింది. సుమారు మధ్యాహ్నం 4 గంటల సమయంలో జరిగిన ఈ ప్రమాదంలో స్కూటీపై ఉన్న బాపట్ల జిల్లా యద్దనపూడి మండలం సురవరపుపల్లికి చెందిన అక్కాచెల్లెళ్లు ముత్యాల హరిణి, ముత్యాల సౌమ్యలు హైవే పక్క ఇనుప కంచె సమీపాన పడటంతో తీవ్రంగా గాయపడ్డారు. స్కూటీ కారుబ్యాక్ డోరును ఢీకొనడంతో ఆవైపున కారులో కూర్చున్న అత్తులూరి భార్గవి కూడా గాయాలపాలయ్యారు. గాయపడిన వారిని స్థానికులు అంబులెన్స్ ద్వారా వెంటనే గుంటూరులోని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై యడ్లపాడు ఎస్ఐ టి.శివరామకృష్ణ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# రెండు బైక్‌లను ఢీకొట్టిన ఆటో

**ఒకరు దుర్మరణం, మరొకరికి గాయాలు**



మృతి చెందిన వెంకట్రావు

అద్దంకి: ముందు వెళ్తున్న రెండు మోటారు బైక్‌లను ఆటో ఢీ కొట్టిన ఘటనలో ఒక వ్యక్తి దుర్మరణం చెందగా, మరో వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని శింగరకొండ సమీపంలో అద్దంకి నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారిలో బుధవారం జరిగింది. అందిన సమాచారం మేరకు.. కొరిశపాడు మండలం తమ్మవరం గ్రామానికి చెందిన వెంకట్రావు (35) అద్దంకిలోని భవానీ సెంటర్‌లో చేపలు దుకాణం నడుపుతుంటాడు. శింగరకొండ భవనాశి చెరువులో చేపలు పడుతున్నారని తెలిసి బైక్‌పై వెళ్లాడు. అదే విధంగా మండలంలోని కలవకూరు గ్రామానికి చెందిన లక్ష్మీపతి కూడా మరో బైక్‌పై వెళ్లాడు. పరిచయస్తులైన వీరిద్దరూ అక్కడి నుంచి తిరిగి వస్తుండగా, శింగరకొండ సమీపంలో వెనుక నుంచి వస్తున్న ఆటో ఢీ కొట్టింది. దాంతో వెంకట్రావు బైక్ మీద నుంచి కిందపడి తల పగలడంతో అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. లక్ష్మీ పతి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. స్వల్పగాయాలైన వ్యక్తిని 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

# కృష్ణానదిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం



మృతదేహాన్ని బయటకు తీస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

తాడేపల్లి రూరల్: ప్రకాశం బ్యారేజ్ కృష్ణానది దిగువ ప్రాంతంలో కుళ్లిపోయిన స్థితిలో మృతదేహం ఉన్నట్లు మత్స్యకారులు బుధవారం తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి వెళ్లిన ఎస్ఐ శ్రీనివాసరావు కృష్ణానది దిగువ ప్రాంతంలోని లాకుల వెంబడి ఉన్న మృతదేహాన్ని బయటకు తీయించారు. అతని వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉంది. మృతుడి ఒంటిపై నల్లని హాఫ్ నిక్కర్ మాత్రమే ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. వయస్సు 30 సంవత్సరాలు ఉండవచ్చని భావిస్తున్నారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే 08645272186 ఫోను నెంబరుకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

# ఐటీఐ విద్యార్థి ఆత్మహత్య



స్టాలిన్ మృతదేహం

ప్రత్తిపాడు: ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఐటీఐ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ప్రత్తిపాడుకు చెందిన మన్నవ జేమ్స్, ఏసుకుమారిలకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు మన్నవ స్టాలిన్ (17) గుంటూరు రూరల్ మండలంలోని అడవితక్కెళ్లపాడులోని ఎంజీఎస్ కళాశాలలో ఐటీఐ ఎలక్ట్రికల్ కోర్సు చదువుతున్నాడు. ఒక్కడే కొడుకు కావడంతో తల్లిదండ్రులు స్టాలిన్‌ను గారాబంగా పెంచుకున్నారు. ఏం జరిగిందో ఏమో తెలియదుగానీ 27వ తేదీ రాత్రి ఏసుకుమారి పనిపై బయటకు వచ్చింది. తిరిగి ఇంటికి వెళ్లి చూసేసరికి స్టాలిన్ ఇంటి వరండాలోని సీలింగ్ ఫ్యాన్‌కు తాడుతో ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. దీంతో తల్లి పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి స్టాలిన్‌ను కిందకు దింపి తండ్రికి సమాచారం అందించారు. అపస్మారక స్థితిలోనికి వెళ్లిన స్టాలిన్‌ను తీసుకుని తల్లిదండ్రులు స్థానికంగా ఉన్న ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే స్టాలిన్ మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. జేమ్స్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.నాగేంద్ర తెలిపారు. విద్యార్థి మృతికి కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు పేర్కొన్నారు.

## ఉద్యోగోన్నతులపై ఊరించి.. ఉసూరుమనిపించారు!

- ప్రమోషన్ల కౌన్సెలింగ్‌కు పిలిచి వాయిదా వేసిన విద్యాశాఖాధికారులు
- దూర ప్రాంతాల నుంచి వచ్చి ఇబ్బందులు పడిన ఉపాధ్యాయులు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యాశాఖాధికారుల తొందరపాటు నిర్ణయాలతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. ఒకవైపు గందరగోళంగా మారిన బదిలీల ప్రక్రియతో సతమవుతున్న ఉపాధ్యాయులను ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్ పేరుతో ముప్పుతిప్పలు పెడుతున్నారు. గుంటూరు జోన్ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 17 హెచ్‌ఎం పోస్టులను ఉద్యోగోన్నతుల ద్వారా భర్తీ చేసేందుకు మంగళవారం ఆర్జేడీ కార్యాలయంలో సర్టిఫికెట్ల పరిశీలన జరిపిన అధికారులు, ఒక్కో పోస్టుకు ముగ్గురేసి చొప్పున ఎంపిక చేశారు. వారందరిని బుధవారం రాత్రి 7 గంటలకు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని పిలిచారు. వీరితోపాటు మున్సిపల్, కార్పొరేషన్ పాఠశాలల్లో హెచ్‌ఎం ప్రమోషన్లకు సైతం ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ఉపాధ్యాయులను పిలిచారు. రాత్రి 8.30 గంటలకు ఉన్నతాధికారుల ఆదేశాలతో కౌన్సెలింగ్‌ను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. తిరిగి గురువారం ఉదయం నిర్వహిస్తామని చెప్పడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముందస్తు ప్రణాళిక లేకుండా కౌన్సెలింగ్‌కు రావాలంటూ బుధవారం హడావుడిగా ఫోన్‌లో సమాచారమిచ్చారని వాపోయారు. తీరా హడావుడిగా వాయిదా వేయడం తగదని ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు విమర్శించారు.

## ఇళ్ల నిర్మాణంలో కనిపించని పురోగతి

గుంటూరు వెస్ట్: పేదలకు సంబంధించి హౌసింగ్ లేఅవుట్లలో నిర్మాణాల పురోగతి ఆశించిన స్థాయిలో లేదని ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ నుంచి అధికారులతో నిర్వహించిన వీడియో సమావేశంలో ఆయన మాట్లాడారు. 3,300 ఇళ్లు లక్ష్యంగా నిర్ణయిస్తే కేవలం 175 ఇళ్లు మాత్రమే నిర్మాణం పూర్తయిందన్నారు. స్టేజ్ అప్‌డేషన్‌లో 486 పూర్తయ్యాయని తెలిపారు. తెనాలి, పొన్నూరు మున్సిపాలిటీల పరిధిలో ఇళ్ల నిర్మాణాలు తక్కువగా ఉన్నాయని గుర్తుచేశారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారులకు స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు మంజూరు చేయించి ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. యోగాంధ్ర కార్యక్రమ నిర్వహణకు ప్రతి శాఖకు లాగిన్ ఇచ్చామన్నారు. డ్వామా, హౌసింగ్, తదితర శాఖలు లబ్ధిదారులను నమోదు చేయించుకోవాలన్నారు. జూన్ 2 నుంచి సచివాలయాల పరిధిలో పోటీలు నిర్వహించాలన్నారు.


సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ నర్సింగ్ (Girls), MLT, వెటర్నరీ, అగ్రికల్చర్, ఫిజియోథెరపీ కోర్సులకు అడ్మిషన్లు జరుగుచున్నవి. బాల బాలికలకు హాస్టల్ వసతి కలదు. M.S.M. College, Guntur. 7386706839, 7780494333

REAL ESTATE

FLAT FOR SALE

■ ప్రతినెల రెంటల్ ఇన్కమ్ వచ్చే విధంగా తిరుపతిలో సర్వీస్ అపార్ట్మెంట్ డిజైన్ చేయబడి ఉన్నది. సంప్రదించండి. 99088 22077

SERVICES

GOLD FINANCE

■ బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) సంప్ర: 87907 41166

WANTED

■ ప్రముఖ బ్యాంకులో మార్కెటింగ్ చేయుటకు ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను జీ: 12000 - 28000. సంప్ర: 83282 81861

■ ప్రముఖ సంస్థలో పనిచేయుటకు పేరేచర్ల, చిన్నపలకలూరు, నల్లపాడు, నవభారత్‌నగర్ లలో M/F సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 73867 43664

■ తెనాలి, మంగళగిరి, తాడేపల్లి, విజయవాడ లోని మా ఆఫీస్ నందు ప్లేస్‌మెంట్స్ కలవు. Any Qualification సంప్రదించగలరు. 94943 51453

■ గుంటూరులోని ఆఫీస్ నందు పని చేయుటకు వీడియో ఎడిటర్, వాయిస్ ఓవర్ ఆర్టిస్ట్, వంటమాస్టర్ కావలెను. సంప్ర: 98666 18811

■ అన్ని రంగాల మార్కెటింగ్ ప్రజలకు అధిక ఆదాయం సంపాదించుకునే సువర్ణ అవకాశం. RMP PRO's టీచర్స్, స్టూడెంట్స్ 99891 69344. Ch.చిన వీరాంజనేయులు, గుంటూరు.

■ కేర్ టేకర్స్ (M/F), నర్సులు, ఆయాలు, విజయవాడలో పేషెంట్ల ఇళ్ళ వద్దనే ఉండి చూసుకొనుటకు, అత్యధిక జీతం+వ+భో. ఏజెంట్ కమీషన్ 6 వేలు. 91608 35559, 78158 35561

■ గుంటూరు ఓల్డ్ క్లబ్ రోడ్డులో ఆపిల్ డెంటల్ క్లినిక్‌లో పనిచేయుటకు లోకల్ అసిస్టెంట్స్ కావలెను. వ: 35సం౹౹లోపు సంప్రదించండి. 6302243437

■ గుంటూరు పట్టాభిపురం, స్వామి థియేటర్ దగ్గర గల ప్రముఖ దంత వైద్యశాల నందు పని చేయుటకు లేడిస్టాఫ్ కావలెను. అర్హత: 10th ఆపైన. Ph: 9704370625, 8008491391

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (VJA బ్రాంచి) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/ పేషంట్ల సేవకు వంట / ఇంటిపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్స్, భో+వసతి+ జీతం: 16-18 వేలు, ఏజెంట్లకు 5 వేలు కమీషన్ 63010 53690, 82475 00574

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ. 475/- మాత్రమే (4 లైన్లు)
ప్రతి అదనపు లైను రూ.100 మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
ఈ పేజీలో ప్రకటనల కొరకు సంప్రదించండి
గుంటూరు
7075167663
7075167541

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.